క్లుప్తంగా

పేదల సొంతింటి కల సాకారం


లబ్ధిదారులతో సుధీర్‌రెడ్డి

సదుం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో పేదల సొంతింటి కల సాకారమవుతోందని వ్యవసాయ సలహా మండలి జిల్లా సభ్యుడు పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని బూరగమంద పంచాయతీ రామాపురం లేఅవుట్‌లో ఆరుగురు లబ్ధిదారులకు ఇళ్లపట్టాలను గురువారం ఆయన అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, గణేష్‌రెడ్డి, బాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

సదుం: మండలంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌కు అంబేడ్కర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రామచంద్రయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు గురువారం వినతి పత్రం అందజేశారు. శ్మశాన వాటికల ఏర్పాటు, సౌకర్యాల కల్పనపై స్పందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

'ఎర్ర'దుంగలు సహా వాహనం స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు

సదుం: ఎర్రచందనం తరలిస్తున్న వాహనాన్ని టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, సదుం పోలీసులు గురువారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ విశ్వనాథ కథనం మేరకు.. అన్నమయ్య జిల్లా రాయచోటి నుంచి ఎర్రచందనం తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో పోలీసులు వాహనాల తనిఖీ చేశారు. కలికిరి మార్గం వైపు నుంచి వేగంగా వచ్చిన ఎరుపు రంగు స్కార్పియో(ఏపీ 27కే 0009) ఆగకుండా దూసుకుపోయింది. దీంతో పోలీసులు దానిని వెంబడించారు. దీంతో గుండ్లూరువారిపల్లె సమీపంలో కారును వదిలి అందులోని వ్యక్తులు పారిపోయారు. దానిని తనిఖీ చేయగా 9 ఎర్రచందనం దుంగలు ఉన్నట్టు గుర్తించారు. దాడుల్లో సదుం సిబ్బంది మురళి, భాస్కర్ పాల్గొన్నారు. వాహనం నంబర్ ఆధారంగా ఇది ఎవరిది? ఎక్కడ నుంచి ఎర్రచందనం తెస్తున్నారో తేల్చేపనిలో పోలీసులు పడ్డారు.


ఎర్రచందనం దుంగలు

కార్యకర్త మృతికి సంతాపం

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లె పంచాయతీ ఎగువ మారుమూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రాజప్ప అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. సర్పంచ్ గోవిందుస్వామి, ఉపసర్పంచ్ నరసింహారెడ్డి, నాయకులు మనోజ్‌రెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు మృతదేహానికి పూలమాలవేసి, నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం


విద్యార్థిని కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న ఉపాధ్యాయులు

పూతలపట్టు: మండలంలోని ఎర్రచెరువుపల్లి ఉన్నత పాఠశాలలో 7 వతరగతి విద్యార్థిని తేజశ్రీ రెండు నెలలుగా బోన్‌క్యాన్సర్‌తో బాధపడుతూ చెన్నైలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆ బాలిక తల్లిదండ్రులు రోజు కూలీలు కావడంతో, వారి ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఉపాధ్యాయులు పాఠశాల తరఫున రూ.26,500 అందజేశారు. మరిన్ని అవసరాలను అందిస్తామని భరోసాను కల్పించారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు నాగలాపురం జట్టు



నాగలాపురం: ఆడుదాం-ఆంధ్రా జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటి నాగలాపురం సచివాలయం జట్టు రాష్ట్ర పోటీలకు ఎంపికైంది. గురువారం తిరుపతిలో జరిగిన కబడ్డీ ఫైనల్స్‌లో సూళ్లూరుపేట, నాగలాపురం జట్లు తలపడ్డాయి. నాగలాపురం జట్టు విజేతగా నిలిచినట్లు పంచాయతీ కార్యదర్శి హరి తెలిపారు. జట్టు క్రీడాకారులను సర్పంచ్ చిన్నదొరై సుధా, ఎంపీపీ సింధూ శ్యామ్ అభినందించారు.

హోమియో.. బాగుందయో..

- కొత్త హంగులతో ఆస్పత్రి
- రోగులకు మెరుగైన సేవలు
- ఆస్పత్రికి పెరుగుతున్న ఔట్‌పేషెంట్లు
- యోగా సేవలు సైతం అందుబాటులోకి

పలమనేరులోని ప్రభుత్వ హోమియో ఆస్పత్రి కొంత హంగులు, మెరుగైన సౌకర్యాలతో రోగులకు సేవలందిస్తోంది. ఆస్పత్రిలో ఓపీ సైతం పెరిగింది. ఇక్కడి ఆస్పత్రిని ప్రభుత్వం ఇటీవల అప్‌గ్రేడ్ చేయడంతోపాటు నామ్ (నేషనల్ ఆయుష్ మిషన్) నిధులు, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈ ఆస్పత్రిలో సౌకర్యాలను మెరుగుపరిచారు.



పలమనేరు ప్రభుత్వ హోమియో వైద్యశాల, రోగులకు ఆస్పత్రిలో అందుతున్న సేవలు

పలమనేరు: జిల్లాలో చిత్తూరు, పలమనేరులో మాత్రమే హోమియో ఆస్పత్రులున్నాయి. ఇటీవల నామ్ నిధులతో స్థానిక ఆస్పత్రిలో పలు అభివృద్ధి పనులు చేశారు. రోగులకు ఆర్వో వాటర్, ప్రత్యేక మూత్రశాలలు, అవసరమైన మందులు, రోజువారీ కార్యక్రమాల నిక్షిప్తం కోసం ల్యాప్‌టాప్ మొదలైన వాటిని అందజేశారు. ముఖ్యంగా పాడుబడిన విధంగా మారిన ఆస్పత్రిలో మరమ్మతులు, అవసరమైన రిపేర్లు చేయించి, పెయింటింగ్ వేయడంతో కొత్తదనం సంతరించుకుంది. ఆస్పత్రి నిర్వహణకు సంబంధించి గతంలో ఏడాదికి రూ.30వేలుగా ఉన్న బడ్జెట్‌ను ఇప్పుడు రూ.1.5లక్షలకు పెంచారు. ఆస్పత్రి వెలుపల హెర్బల్ గార్డెన్ సైతం పెంచుతున్నారు.


ఆస్పత్రిలో మందులు పంపిణీ

పెరిగిన ఓపీ.. త్వరలో యోగాసేవలు




గతంలో ఈ ఆస్పత్రికి నిత్యం నలభైమంది వరకు వచ్చేవారు. ప్రస్తుతం 70మంది వరకు వస్తున్నారు. త్వరితగతిన మెరుగైన సేవలతో ఓపీ వంద వరకూ పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో యోగాసేవలు సైతం అందుబాటులోకి తెస్తున్నాం. ఇటీవలే ఈ పోస్టులకు ఇంటర్వ్యూలు నిర్వహించాం. ఆదేశాలు అందాక వీరి సేవలు రోగులకు అందుబాటులోకి వస్తాయి. హోమియో ఆస్పత్రిని ఆధునీకరించి, అవసరమైన పరికరాలు, ఫర్నీచర్, ఆన్‌లైన్‌కోసం సిస్టమ్స్ ఇచ్చారు. ఆయుష్ మిషన్, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులందాయి. సెలవు దినమైన ఆదివారం మినహా మిగిలిన రోజుల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట, ఆపై 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆస్పత్రి సేవలు అందుబాటులో ఉంటాయి.
–ఆస్పత్రి వైద్యులు డాక్టర్లు మోహన్‌క్రిష్ణ, మాధవిలత

వైద్య సేవలు భేష్



పట్టణంలోని హోమియో ఆస్పత్రిలో ఇప్పుడు సేవలు చాలా బాగున్నాయి. అన్ని రకాల వ్యాధులకు అవసరమైన మందులు ఇస్తున్నారు. ఇది తెలియని వాళ్లు ఓసారి ఇక్కడి వైద్య సేవలకు వస్తే మంచిది. ట్రీట్‌మెంట్, రిజల్ట్ కూడా బాగుంది. –కోదండరామయ్య, పలమనేరు

డాక్టరు చేతివాసి బాగుందప్పా



నాకు కీళ్లనొప్పులు ఎక్కువగా ఉంటే నడిచేకి కూడా అయ్యేలేదు. మా కర్ణాటకలో ఏడేడో చూపిస్తి. కాని ఏం బాక్కాలే. పలమనేరు హోమియో ఆస్పత్రిలో బాగా చూస్తారని ముందు ఈడొచ్చి చూపించుకుపోయిన మా ఊరిజనం నాకు సెప్పిరి. అందుకేనేనీడికొస్తి. ఈటికి 15 రోజుల ముందు ఓకితా, ఇబ్బుడు వస్తి. అబ్బిటికి, ఇబ్బిటికి చానా బాగుంది. నొప్పులు తగ్గి ఇంట్లో పనులు బాగా చేసుకుంటాడాప్పా. ఇక్కడ ఆస్పత్రులను జగన్ బాగా చేసినాడని మా జనం చెబితే ఏమో అనుకుంటిగా ఈడ చూస్తాంటే మంచి సౌకర్యాలుండాయి. మాకు చార్జీ కాసులేకదా ఖర్చు. ఇక్కడండా ఫ్రీనే. మంచి మందులు కూడా ఇస్తాండారు. ఈడ డాక్టరు చేతివాసి బాగుందప్పా. –శశికళ,హెచ్.గొల్లహళ్లి, కర్ణాటక

డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు


గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్న ఎంపీపీ

సదుం: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చొరవతో మండలంలో 70 మంది డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరయ్యాయని ఎంపీపీ ఎల్లప్ప తెలిపారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డప్పు కళాకారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. ఈ కార్డుల మూలాన కళాకారులకు పింఛన్ పొందడానికి వీలవుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వరప్రసాద్, తహసీల్దార్ చంద్రశేఖర్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జి ప్రకాష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ విభాగం జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి, సీతాపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకూ సామాజిక బాధ్యత: సీఐ



డిజిటల్ బోర్డును ప్రారంభిస్తున్న సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ, డిజిటల్ బోర్డు

పలమనేరు: ఎంతసేపూ పోలీసులు మీదే ఆధారపడకుండా ప్రజలు సైతం తమ సామాజిక బాధ్యతలను గుర్తెరిగి నడుచుకోవాలని పలమనేరు సీఐ చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. స్థానిక వారపు సంత మార్గంలో పీఎంపీ వైద్యులు దిల్‌షాద్ అందజేసిన ప్రజలకు సూచనలు ఇచ్చే డిజిటల్ బోర్డును గురువారం ఆయన ఎస్‌ఐ సహదేవితో కలసి ప్రారంభించారు. పట్టణంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించరాదని, బ్యాంకుల వద్ద అప్రమత్తంగా ఉండాలని, అపరితులకు ఏటీఎం పిన్ నంబరు చెప్పడం లాంటివి చేయరాదన్నారు. పట్టణంలోని రద్దీగా ఉండే వీధుల్లో ఒకవైపు పార్కింగ్‌ను అమలు చేస్తున్నామని, ఇది తెలిసినా కొందరు నిబంధనలు పాటించడం లేదన్నారు. ఇలా చేస్తే కేసులు నమోదు తప్పదన్నారు. కార్యక్రమంలో పోలీసులు, స్థానికులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన


టీఎస్ అగ్రహారం సచివాలయ సేవలను తెలుసుకుంటున్న విద్యార్థులు

పలమనేరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వృత్తి విద్య విద్యార్థులు 'ఇండస్ట్రియల్ విజిట్' కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణ సమీపంలోని టీఎస్ అగ్రహారం సచివాలయాన్ని సందర్శించారు. అక్కడ ప్రజలకు అందుతున్న సేవలను తెలుసుకున్నారు. ఈ స్కూల్‌లో రెండేళ్లుగా ఇండస్ ఎడ్యుకేషన్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థ అగ్రికల్చర్, కంప్యూటర్స్ కోర్సుల్లో వృత్తి విద్యాకోర్సులను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా స్థానిక ఉపాధ్యాయ బృందం ఇండస్ట్రియల్ విజిట్ నిర్వహించింది. సచివాలయ సేవలతో ప్రభుత్వం ప్రజలకు ఎంతగా చేస్తోందో ఉద్యోగులు తెలియజేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశంలోని పలు రాష్ట్రాలను ఆకర్షించిందని, ఆ రాష్ట్రాలు కూడా ఈ వ్యవస్థను ప్రవేశపెట్టే యోచన చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షంషీర్, టీచర్లు అభిలాష్, శివశంకర్, చంద్రశేఖర్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.


క్షేత్రస్థాయి పర్యటనకు వెళుతున్న విద్యార్థులు

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

పలమనేరు: రహదారి భద్రతా నియమాలను డ్రైవర్లు విధిగా పాటించాలని క్యాటిల్‌ఫామ్ చెక్‌పోస్ట్ ఎంవీఐలు ఆంజనేయప్రసాద్,భూషన్‌రెడ్డి, హరికిశోర్ కోరారు. 35వ రోడ్డు భద్రతా మాసోత్సవం పురస్కరించుకుని స్థానిక తనిఖీ కేంద్రం వద్ద జాతీయ రహదారిలో ప్రయాణించే వాహనాల డ్రైవర్లకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. దీనికి సంబంధించిన కరపత్రాలను వారికి అందజేసి వారు మాట్లాడారు. మోటార్ సైక్లిస్టులు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే భారీ జరిమానాలు తప్పవని హెచ్చరించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ కూడా డ్రైవింగ్ చేయరాదన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం


డ్రాయింగ్ టీచర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు హైస్కూల్లో ఉద్యోగ విరమణ పొందిన డ్రాయింగ్ టీచర్ సుబ్రమణ్యంకు గురువారం వీడ్కోలు సన్మానం చేశారు. ఆయన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీవాణి, వెంకటసిద్దులు, రాజేంద్ర, వెంకటరమణారెడ్డి, రాజశేఖర్, విమలా విక్టోరియా, స్నేహమాలిని తదితరులతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపిక


సాహితి

పెద్దపంజాణి: అనంతపురం జిల్లా ధర్మవరంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ త్రోబాల్ చాపియన్‌షిప్‌లో మండలంలోని మదర్ థెరిసా సీబీఎస్‌ఈ స్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థినులు పాల్గొన్నారు. వీరిలో సాహితి (8వ తరగతి) ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయస్థాయి సీనియర్ త్రోబాల్ చాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ రవీంద్రబాబు గురువారం తెలిపారు. ఈ నెల 7 నుంచి 11వ తేదీ ఈ పోటీలు న్యూఢిల్లీలో నిర్వహిస్తారని, ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున తమ విద్యార్థి పాల్గొంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డేవిడ్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆగమోక్తంగా బాలాలయ స్థాపన పూజలు


కలశాలను ఊరేగింపుగా తీసుకు వస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం అనుబంధంగా ముత్యాలమ్మగుడివీధిలో వెలసిన ఏడు గంగమ్మల ఆలయ జీర్ణోద్ధారణ, ఆధునికీకరణ పనుల్లో భాగంగా గురువారం ఆగమోక్తంగా బాలాలయ పూజలు నిర్వహించారు. ముందుగా కలశ స్థాపనను శాస్త్రోక్తంగా చేపట్టారు. హోమ పూజలను నిర్వహించారు. ప్రధాన కలశాన్ని ఆలయ ఆవరణంలో వైభవంగా ఊరిగించి, గంగమ్మ తల్లికి కలశ జలాలతో విశేష అభిషేకాలు నిర్వహించి, విశేషంగా అలంకరించారు. తదుపరి సంప్రదాయ పద్ధతిలో బాలాలయ పూజలను పండితులు వేదోక్తంగా నిర్వహించారు.


కలశ పూజలు చేస్తున్న వేదపండితులు

రూ.40 లక్షలతో ఆధునికీకరణ

పూజల్లో పాల్గొన్న దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ ఏడు గంగమ్మల ఆలయాన్ని రూ.40లక్షలతో ఆధునీకరణ చేసి ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. పాలకమండలి సభ్యురాలు రమాప్రభ, ఆలయ అధికారులు వెంకటసుబ్బయ్య, స్థపతి కుమార్, సూర్యప్రసాద్, వేదపండితులు సంబంధం గురుకుల్, దక్షిణామూర్తి, అర్ధగిరి, ప్రముఖులు బాలసుబ్రహ్మణ్యం, స్వర్ణమూర్తి, భాస్కర్ ముదిరాజ్, జలకం కిషోర్, రవి, బాలగౌడ్ పాల్గొన్నారు.

వేకువజాము నుంచి పెన్షన్ల పంపిణీ


సోమల: కందూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఈశ్వరయ్య



పుంగనూరు: పెన్షన్లు పంపిణీ చేస్తున్న జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, రహమత్ నగర్‌లో..

పుంగనూరు: మున్సిపాలిటీలోని 31వ వార్డుల్లో సామాజిక పింఛనుదారులకు గురువారం వేకువజాము నుంచి వలంటీర్లు, సచివాలయ కార్యదర్శులు పెన్షన్లు పంపిణీ చేశారు. చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో దీనిని పూర్తిచేశారు. అలాగే మండలంలోని మంగళం, కంగానెల్లూరు గ్రామాలలో ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో , యూబీ కాంపౌండులో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, రహమత్‌నగర్‌లో జిల్లా మైనారిటీ సెల్ కార్యదర్శి మహబూబ్‌బాషా, అలాగే కౌన్సిలర్లు అర్షద్‌అలీ, నరసింహులు, కిజర్‌ఖాన్, రేష్మా, రెడ్డెమ్మ, కాళిదాసు, కమలమ్మ, జయభారతి, సాజిదాబేగం, భారతి, ఆదిలక్ష్మి, పద్మావతి తాము ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో పింఛన్లు పంపిణీ చేశారు.

పులిచెర్లలో..

పులిచెర్ల(కల్లూరు): మండలంలో గురువారం ఉదయం అన్ని గ్రామాల్లో వలంటీర్లు పింఛన్ల పంపిణీ చేశారు. 102 ఇ రామిరెడ్డిగారిపల్లెలో సర్పంచ్ స్వాతిబాల పింఛన్లను పంపిణీ చేసి మాట్లాడారు. బాలకృష్ణ రాజు, మోహన్‌రెడ్డి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.


పులిచెర్ల: 102.ఇ రామిరెడ్డిగారిపల్లెలో..

కందూరులో..

సోమల: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన చేస్తున్నారని, రాబోవు ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీని ఆదరించాలని ఎంపీపీ ఈశ్వరయ్య కోరారు. గురువారం మండలంలో కందూరులో ఎంపీపీ, సర్పంచ్ మసూద్, సోమలలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ మొగిళప్పగారి శ్రీనివాసులు, వీ.రమణ, సచివాయ కన్వీనర్ ఐలా సూరి, వాటర్ షెడ్ వైస్ చైర్మన్ పీఎల్‌ఆర్ రాజారెడ్డి గృహసారథులతో కలిసి పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడారు.

వైద్య పరిశోధనలతో సమాజానికి ఫలాలు

- ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు నాగేంద్ర ప్రసాద్ పిలుపు

గుడుపల్లె: వైద్యరంగంలో రోజురోజుకూ చోటుచేసుకుంటున్న మార్పులు, మొండి వ్యాధులకు మరింత మెరుగైన చికిత్సా పద్ధతులను అన్వేషించే దిశగా పరిశోధనలు చేసి వాటి ఫలితాల ఫలాలు సమాజానికి అందేలా చూడాలని ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ నాగేంద్రప్రసాద్ పిలుపునిచ్చారు. గురువారం పీఈఎస్ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో మూడు రోజుల స్టేట్ లెవల్ రీసెర్చ్ మెథ డాలజీ వర్క్‌షాప్ ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా నాగేంద్రప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. ఈ వర్క్‌షాపులో వివిధ పరిశోధన పద్ధతుల గణాంక విశ్లేషణ, నైతిక పరిగణాలపై లోతైన అవగాహనతో సన్నద్ధం చేసి ఒక లక్ష్యంతో సమగ్రంగా సెషన్లను నిర్వహించాలన్నారు. సరికొత్త వ్యాధుల పై పరిశోధనలు చేయాలన్నారు. కోవిడ్ సమయంలో ప్రపంచ వ్యాప్తంగా నివారణ మందు, చికిత్స విధానాలపై చేసిన పరిశోధనలను ఉదహరించారు. వైద్య విద్య పరిశోధనలకు పీఈఎస్ కళాశాల అత్యుతమ ప్రతిభకు చిరునామా కావాలని ఆకాంక్షించారు. వైద్య పరిజ్ఞానం కొత్తపుంతలు తొక్కే కొద్దీ వ్యాధులకు చికిత్స మరింత సులువు అవుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హెచ్‌ఆర్ క్రిష్ణారావు, సూపరింటెండెంట్ సుబ్రమణ్యం, వైద్య నిపుణులు ర్యాలీ సుబ్రమణ్యం, చిత్ర నాగరాజ్, ప్రవీణ్‌కుమార్, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.


పీఈఎస్‌లో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రిన్సిపల్

రేషన్ షాపుల డీలర్లతో జేసీ సమీక్ష

పులిచెర్ల(కల్లూరు): నిత్యావసర సరుకులు కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం డీలర్లతో జేసీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, కొలతల్లో తేడాలు లేకుండా చూడాలన్నారు. ప్రభుత్వం సన్న రకం బియ్యం సరఫరా చేస్తోందని, ఇదిపూర్తిగా ప్రజలకు సక్రమంగా అందాలన్నారు. అవకతవకలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, తహసీల్దార్ శేషగిరిరావు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్

కులవృత్తులను కాపాడుకోవాలి

పలమనేరు: అంతరించిపోతున్న కులవృత్తులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా మేదర సంఘ మహిళా విభాగం కార్యదర్శి మల్లిక అన్నారు. స్థానికంగా ఎన్నో ఏళ్లుగా వెదురు వస్తువులను తయారుచేస్తున్న కురువృద్ధుడు ఊత్తుకోట్టై మునస్వామిని గురువారం మేదర సంఘ నాయకులు ఘనంగా సన్మానించారు. మల్లిక మాట్లాడుతూ ఇక్కడ మేదర కులస్థులు దశాబ్దాలుగా వెదురుతో పలు వస్తువులను చక్కగా తయారుచేస్తున్నారని, సాంప్రదాయ కులవృత్తులను ఇప్పటితరం కూడా నేర్చుకుని వాటిని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏసుబాబు, నందగోపాల్, మధుమోహన్ తదితరులు పాల్గొన్నారు.


మునస్వామిని సన్మానిస్తున్న మేదర సంఘ నేతలు

ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు శ్రేయస్కరం



తవణంపల్లె: వైద్య సేవలందిస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్, ఐరాల: వైద్యసేవల్లో డాక్టర్ పూర్ణలత

తవణంపల్లె: గర్భిణులు ఆస్పత్రిలో ప్రసవించడం తల్లీబిడ్డకు శ్రేయస్కరమని వైద్యాధికారులు మోహన్‌వేలు, వినయ్‌కుమార్ తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని నలిశెట్టిపల్లె, జొన్నగురకల గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. జొన్నగురకల గ్రామంలో డాక్టర్ మోహన్‌వేలు 53 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. నలిశెట్టిపల్లెలో డాక్టర్ వినయ్‌కుమార్ 67 మంది రోగులకు పరీక్షలు చేయించి సూచనలు, సలహాలిచ్చారు. డాక్టర్ మోహన్‌వేలు మాట్లాడుతూ గర్భిణులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అదే విధంగా బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, డీఈఓలు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం లక్ష్యం

ఐరాల: మారుమూల ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నాదే ఫ్యామిలీ డాక్టర్ లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని ఇరువారంపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. దీర్ఘకాలిక, ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స చేసుకున్న రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.